# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానం

కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థలు రోజురోజుకు పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు లేకుండా పెంచడం పట్ల దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ అభిప్రాయ పడుతున్నది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలే ప్రధాన కారణం.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, బాధ్యతారహిత విధానాలతో అన్ని వర్గాల ప్రజలకు భరించలేని భారంగా పెట్రోల్, డీజిల్ ధరలు మారాయని ఈ సభ భావిస్తోంది. ప్రజలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వపరంగా ఎటువంటి చర్యలను తీసుకోకపోవడాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ గర్హిస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర గణనీయంగా తగ్గినప్పటికీ పెట్రోల్ / డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం తగ్గించకపోవడాన్ని ఈ సభ నిరసిస్తోంది. 2014 జూన్ నెలలో డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం లీటరుపై రూ.3.56 ఉండగా, 2017 సెప్టెంబర్ నాటికి లీటరుపై రూ.17.33 కు పెంచడం దారుణంగా అభిప్రాయపడుతోంది. 2014లో లీటరు పెట్రోల్‌పై రూ.9.48 ఉన్న కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని 2018 నాటికి లీటరుకు రూ.19.48 కు పెంచడాన్ని తప్పుపడుతోంది.

మౌలిక సదుపాయాల సెస్ పేరుతో లీటర్ పెట్రోల్‌కు రూ.7, డీజిల్‌కు

రూ.8 అదనపు భారాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయడం అన్యాయంగా శాసనసభ అభిప్రాయ పడుతోంది.

గత నాలుగున్నరేళ్ళలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.23 లక్షల కోట్ల పైచిలుకు నిధులు ఎక్సైజ్ డ్యూటీ మరియు ఇన్‌కమ్‌ట్యాక్స్ / డివిడెండ్ ద్వారా సమకూర్చుకున్నప్పటికీ, సామాన్య ప్రజలపై భారం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపించకపోవడాన్ని గర్హిస్తోంది.

సెస్‌లు, పన్నులు, డివిడెండ్‌ల రూపంలోను పెద్ద ఎత్తున ఆదాయం పొందుతూ కూడా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలపై పెట్రోల్ / డీజిల్ భారాన్ని మరింతగా మోపడం తీవ్రమైన ప్రజా వ్యతిరేక చర్యగా సభ అభివర్ణిస్తున్నది.

ప్రజలపై కేంద్రం మోపిన ఈ ఆర్థిక భారం నుంచి కొంతమేర ఉపశమనం కలిగించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ / డీజిల్‌పై లీటర్‌కు రూ.2 చొప్పున వ్యాట్ తగ్గించాలని నిర్ణయించడాన్ని ఈ సభ అభినందిస్తోంది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, లోటు బడ్జెట్‌తో సతమతమవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కొంత ఊరటనిస్తుందని భావిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పై నిర్ణయం నేపథ్యంలోను, పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి వెంటనే ఎక్సైజ్ డ్యూటీ / సెస్‌లను గణనీయంగా తగ్గించాలని, తక్షణ ఉపశమన చర్యలను చేపట్టాలని కోరుతూ ఈ ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానిస్తున్నది.